క్లుప్తంగా

వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి

• కిలగాడ పీహెచ్‌సీ ఎదుట నిరసన



కిలగాడ పీహెచ్‌సీ ఎదుట నిరసన చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ముంచంగిపుట్టు: మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న లంకొండ ప్రభావతి అనే మహిళపై దాడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం కిలగాడ పీహెచ్‌సీ ఎదుట నల్ల బ్యాడ్జీలతో వైద్యులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని,వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు రమేష్,శిరీషలు మాట్లాడుతూ విధుల్లో ఉండే వైద్యులకు,సిబ్బందికి రక్షణ కల్పించే విధంగా కఠిన చట్టాలు అమలు చేయాలని కోరారు. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు,సిబ్బందికి రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రహ్మణ్యం,హెచ్‌వీ వేదవతి,హెల్త్ అసిస్టెంట్లు,ఏఎన్‌ఎంలు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంధన పొదుపు తప్పనిసరి



ర్యాలీలో పాల్గొన్న ఈఈ అప్పారావు, సిబ్బంది

అరకులోయటౌన్: ఇంధనాన్ని పొదుపుగా వినియోగించడం ద్వారా భవిష్యత్ అవసరాలకు తోడ్పాటు అవుతుందని, ఇంధన పొదుపుపై అందరికీ అవగాహన ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈ అప్పారావు తెలిపారు. ఇంధన పొదుపు దినోత్సవం సందర్భంగా మంగళవారం అరకులోయ పట్టణంలో విద్యుత్ శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ అందరూ తప్పనిసరిగా ఇంధనాన్ని పొదుపుగా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సురేష్, ఏఈఈ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు



ఆందోళనలో పాల్గొన్న వెదుళ్ల లచ్చిరెడ్డి

వై.రామవరం: మండలం కేంద్రం వై.రామవరం నుంచి మఠంభీమవరం, పోతవరం గ్రామాల మీదుగా గుర్తేడు, పాతకోట గ్రామాలకు, అన్ని పంచాయతీలను కలిపి ప్రధాన రహదారిని, ఇతర రోడ్లను నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 2వ రోజు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో లచ్చిరెడ్డితో పాటు ఆదివాసీ చైతన్యవేదిక సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మడిగొండ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు గుడ్ల త్రిమూర్తులు, ఈక నరసన్నదొర, గుడ్ల ప్రసాదు, పుడిగి లక్ష్మణరావు, గొతు చిన్నారావు, దాగేరి గంగరాజు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులపై చిన్నచూపు

పాడేరురూరల్(అరకులోయ రూరల్): వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం నాయకుడు శెట్టి నాగరాజు తెలిపారు.పాడేరు సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యఆరోగ్యశాఖలో పలు కారణాలతో కొంత మందిని విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. హెల్త్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించడం ప్రభుత్వానికి తగదన్నారు. తొలగించి ఉద్యగులందరినీ విధుల్లో తీసుకోవాలని, లేకపోతే ఉద్యమం చేస్తామని చెప్పారు. ఉద్యోగ సంఘం నాయకులు లక్ష్మణరావు, మురళి, వెంకటరమణ, నాగరాజు, సత్యనారాయణ,దేవి,మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై దర్యాప్తు



అదృశ్యమైన మనోజ్

కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థి మనోజ్ అదృశ్యంపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం పాఠశాల నుంచి విద్యార్థి బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. ఎస్‌ఐ కిషోర్ వర్మ గురుకుల పాఠశాలను సందర్శించి తోటి విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. పలు వాట్సాప్ గ్రూపుల్లోనూ అదృశ్యమైన విద్యార్థి ఫొటోను షేర్ చేసి, వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.



కిందుగూడలో విద్యార్థుల తల్లిదండ్రులు నిర్మించిన పాఠశాల



తరిగెడలో రేకుల షెడ్‌లో పాఠశాల

బడులు ఇలా.. చదువులు ఎలా ?

ఒకచోట పాకే పాఠశాల.. మరో గ్రామంలో ఒక గిరిజనుడి ఇంటి అరుగే బడి...ఇంకోచోట చెట్టు నీడలోనే బోధన...మరో దగ్గర శిథిల గదుల్లోనే భయం భయంగా తరగతులు నిర్వహణ... మరో స్కూల్‌లో శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతుంటాయి...ఇదీ ముంచంగిపుట్టు మండలంలోని పలు పాఠశాలల దుస్థితి.. చిన్నపాటి జల్లు పడిన కారిపోతుండడంతో బురదలో కూర్చోలేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు. వర్షం పడినా, గట్టిగా గాలి వీచినా బడికి సెలవు ఇవ్వవలసిందే... కనీసం కూర్చోడానికి కూడా సరిపడినంత స్థలం లేక పలు పాఠశాలలు పశువుల పాకల కన్నా దయనీయంగా ఉన్నాయి.

- పాకల్లో పాఠశాలలు
- కొద్దిపాటి వర్షానికే కారిపోతున్న బడులు
- అవస్థలు పడుతున్న గిరిజన విద్యార్థులు
- భవనాలు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల వేడుకోలు

మండలం	: ముంచంగిపుట్టు
పంచాయతీలు	: 23
గ్రామాలు	: 372
పాఠశాలలు	: 205
విద్యార్థులు	: 9 వేలకుపైగా
శిథిలమైన పాఠశాల భవనాలు	: 123
వీటిలో కూల్చివేసిన	: 55
పాకల్లో నిర్వహిస్తున్నవి	: 30
వరండాల్లో నిర్వహిస్తున్నవి	: 25

ముంచంగిపుట్టు: మండలంలోని 23 పంచాయతీల్లో మొత్తం 205 పాఠశాలలున్నాయి. తొమ్మిది వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో 123 పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నట్టు అధికారులు గుర్తించారు. ఇందులో 55 పాఠశాలలను కూల్చివేశారు. అయితే వాటి స్థానంలో కొత్తగా భవనాలను నిర్మించకపోవడంతో వంటషెడ్లు,పాకలు, విద్యార్థుల తల్లిదండ్రులు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్థలాల్లో తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. 68 పాఠశాలలను శిథిల భవనాల్లోనే భయం భయంగా కొనసాగిస్తున్నారు.

వణికిపోతూ చదువులు : భవనాలు లేకపోవడంతో మండలంలో 30 పాఠశాలలను చిన్నపాటి పాకలు, పందిళ్ల కింద నిర్వహిస్తున్నారు. మరో 25 పాఠశాలలు చెట్ల నీడలో,ఇంటి వరండాల్లో కొనసాగుతున్నాయి. శీతాకాలం కావడంతో చలిగాలలకు చిన్నారులు వణికిపోతూ చదువుకోవలసి వస్తోంది. పై నుంచి వీస్తున్న చలిగాలలు, కింద మట్టి నేలపై కూర్చోలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.



నూతన భవనం నిర్మించాలని కోరుతున్న కిందుగూడ గ్రామస్తులు, విద్యార్థులు



వంటషెడ్‌లో పాఠాలు వింటున్న సుత్తిగూడ విద్యార్థులు

ఎన్ని సార్లు విన్నవించినా... : పాఠశాలలకు భవనాలు నిర్మించి, తమ పిల్లల చదువులు సక్రమంగా సాగేలా చూడాలని విద్యార్థులు తల్లిదండ్రులు పలుమార్లు విద్యాశాఖాధికారుల వద్ద మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. ఆందోళనలు చేసినా స్పందించిన పాపాన పోలేదు. విద్యార్థుల ఇబ్బందులు గమనించిన తల్లిదండ్రులు శ్రమదానంతో, చందాలతో పాకలను ఏర్పాటు చేసి చదువులు కొనసాగేలా చేశారు. తక్షణమే అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి, పాఠశాలల భవనాలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాకలో తరగతులు

మా ఊళ్లో పాఠశాలను పాకలో నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా సెలవు ఇస్తున్నారు. చదువులు సరిగా సాగడం లేదు. పాఠశాల భవనాన్ని నిర్మించాలి.

– జి.నాగేష్, తరిగెడ, ముంచంగిపుట్టు మండలం

వర్షం పడితే బురద మయం

పాఠశాలకు భవనం లేక చదువుకునేందుకు ఇబ్బందిగా ఉంది.వర్షం పడితే పాఠశాల బురదమయంగా మారుతోంది. ఆ బురదలో కూర్చుని చదవుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి, మా పాఠశాలకు భవనం నిర్మించాలి.

– కె.రాజు, విద్యార్థి, సుత్తిగూడ పాఠశాల, ముంచంగిపుట్టు మండలం.

ప్రతిపాదనలు పంపాం

మండలంలో భవనాలు లేని పాఠశాలలను గుర్తించాం. పాకలు,షెడ్లలో,శిథిలావస్థలు ఉన్న భవనాల్లో తరగతులు నిర్వహిస్తుండడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నివేదికను తయారు చేసి,ప్రతిపాదనలు పంపించాం.నిధులు మంజూరైన వెంటనే భవనాల నిర్మాణం ప్రారంభిస్తాం.

– కె.కృష్ణమూర్తి, ఎంఈవో,ముంచంగిపుట్టు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ హిమగిరి

అరకులోయటౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అరకులోయ సీఐ ఎల్.హిమగిరి తెలిపారు. దివంగత ఐద్వా నాయకులురాలు శారదా వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక శారదా నికేత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొబైల్ ద్వారానే సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యతని చెప్పారు. డ్రగ్స్, గంజాయి, సారా తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో త్రినాథరావు, అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజు, సీఐటీయూ నాయకుడు వి. ఉమామహేశ్వరరావు, ఐద్వా నాయకురాలు వి.వి. జయ, హెచ్‌ఎం చిరంజీవి, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ మేకింగ్‌పై పోటీలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పాడేరురూరల్(అరకులోయరూరల్): పాడేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు మంగళవారం పోస్టర్ మేకింగ్, స్లోగన్ రైటింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వనం చిట్టిబ్బాయ్ లింగబేధం లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రసూల్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ సౌజన్య,అధ్యాపకులు కోటేశ్వరరావు,నిర్మల,సునీత,రాధాకుమారి, జయలక్ష్మి,లావణ్య,హిమబిందు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు

కూనవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల ద్వారా చేపట్టిన పనులను వివరించారు. వ్యవసాయ ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆయా కేంద్రాలకు 15,500 గోనె సంచులు అందజేశామని, టెక్నికల్ అసిస్టెంట్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. 17 శాతం తేమ మించితే ధాన్యాన్ని ఆరబెట్టాలని సూచించారు.మద్దతు ధర రూ.2,300 ఉందని చెప్పారు. వయస్సు పైబడిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాలేక ఇబ్బందులు పడుతున్నారని, ట్రాన్స్‌పోర్టు చార్జీలు ఇప్పించే ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు కోరారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుప్రకాష్ మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో జేజేఎం పనులు జరుగుతున్నాయని చెప్పారు. పనులు పూర్తి కాగానే ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. ఈ స్కీమ్ నిర్వహణకు ఆయా గ్రామ పంచాయతీల ద్వారా వాటర్ అండ్ శానిటేషన్ కమిటీలు ఏర్పాటు చేసి నామ మాత్రపు ఫీజులు కట్టించుకోవాలని కలెక్టర్ సూచించారని తెలిపారు. తదుపరి విద్యుత్ ఏఈఈ కాజకపూర్ మాట్లాడుతుండగా పలువురు ప్రజా ప్రతినిధులు కలుగజేసుకుని మాట్లాడుతూ బిల్లు కలెక్టర్ లేనందున నెలనెలా విద్యుత్ బిల్లు చెల్లించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం తాత్కాలికంగానైనా బిల్‌కలెక్టర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈసమావేశంలో జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీడీవో కె.ఆర్.విజయ, తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న జీకేవీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు



చింతపల్లిలో శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

గూడెంకొత్తవీధి: సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి, సమన్వయంతో పనిచేయాలని గూడెంకొత్తవీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ పాపారావు పరిపాలనాధికారి ఇమ్మానుయేల్, పలుశాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

చింతపల్లి: గ్రామస్వరాజ్య స్థాపన, పంచాయతీల అభివృద్ధికి సుస్థిర లక్ష్యాల సాధనే ధ్యేయంగా పనిచేయాలని చింతపల్లి ఎంపీడీవో శ్రీనివాస్‌అన్నారు. సుస్థిర లక్ష్యాల అమలుపై మంగళవారం మండల పరిషత్ సమావేశమందిరంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాలను ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో శిక్షణ అధికారులు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం పాలన చైతన్య సదస్సును విజయవంతం చేయాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న సర్పంచ్‌లు

జి.మాడుగుల: మండలం కేంద్రం జి.మాడుగుల రామాలయం వీధిలో ఈనెల 20న నిర్వహించనున్న ఆదివాసీ స్వయం పాలన చైతన్య సదస్సును విజయవంతం చేయాలని మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. ఈ సదస్సు కరపత్రాన్ని ఉరుము గ్రామంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సదస్సులో గిరిజనులు, అన్ని పార్టీల నాయకులు,యువకులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు కిముడు రాంబాబు, సర్పంచ్‌లు ఐసరం హనుమంతరావు, లసంగి మాలన్న, సీదరి కొండబాబు,కృష్ణమూర్తి, చినకు మారి, చిలకమ్మ, సూరిబాబు, మధు, సత్యనారాయణ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



రాజవొమ్మంగిలో నకారా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు



అడ్డతీగలలో సీనియర్ సభ్యులను సన్మానిస్తున్న పెన్షనర్లు



ముంచంగిపుట్టులో పెన్షనర్స్‌డే కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

పాడేరురూరల్(అరకులోయరూరల్): మండల కేంద్రం పాడేరులో మంగళవారం 43వ జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ల ఉద్యమకారుడు డి.ఎస్. నకరా చిత్రపటానికి స్థానిక రిటైర్డ్ ఏటీవో నాగభూషణం, రిటైర్డ్ ఎస్‌డీసీ అప్పారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ దేశంలో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఆయన ఎన్నో పోరాటాలు చేశారని చెప్పారు.

రాజవొమ్మంగి: స్థానిక విశ్రాంత ఉద్యోగులు తమ సంఘం కార్యాలయంలో మంగళవారం పెన్షనర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్‌లోని సీనియర్స్ అబ్బాయిదొర, రాధాకృష్ణలను దుశ్శాలువాలతో తోటి విశ్రాంత ఉద్యోగులు సన్మానించారు. అంతకు ముందు పెన్షనర్స్ హక్కుల కోసం పోరాడిన దివంగత డి.ఎస్. నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ అధ్యక్షులు ఎస్.బి.బి. కృష్ణవర్మ, ఆర్పీ రాజు, మరిడిరాజు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండల కేంద్రం అడ్డతీగలలో మంగళవారం పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షురాలు సూర్యాకాంతం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ ఉద్యమ రూపకర్త నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్‌టీవో వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పెన్షనర్లకు ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ పెన్షనర్లను సన్మానించారు.అసోసియేషన్ కార్యదర్శి ఆకిరి రామారావు, కోశాధికారి బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. ఈ సందర్భంగా మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామానుజులు మాట్లాడుతూ శేష జీవితాన్ని అందరూ ఆనందంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విశ్రాంతి ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రసాద్‌రావుపడాల్,కార్యదర్శి మోంద కొండ,ఉపాధ్యాక్షుడు కామేశ్వరరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి



పాడేరు తహసీల్దార్‌కు వినతులు అందిస్తున్న గిరిజనులు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు తహసీల్దార్ వంజంగి త్రినాథరావు తెలిపారు. మండలంలో డి.గొందూరు, కాడేలి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి స్వీకరించిన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. డి.గొందూరులో 55, కాడేలిలో 48 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పోలరాజు, ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణపాత్రుడు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: భూ యజమాని మరణిస్తే ఆయన భార్య లేదా వారసులకు ఆ భూమిపై హక్కు కావాలంటే మ్యుటేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని గూడెంకొత్తవీధి తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. సంకాడలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూసదస్సులో ఆయన మాట్లాడారు. రెవెన్యూపరమైన అంశాలను గ్రామస్తులకు వివరించారు. భూసంబంధిత సమస్యలపై అర్జీలను స్వీకరించి, కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఐ మహదేవ్, వీఆర్వో తరుణ్, సీనియర్ సహాయకులు చిన్నయ్యపడాల్, మండల సర్వేయర్ శ్రీను పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, ఈ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఓగిపాలెంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వంశపార్యం పరంగా వస్తున్న భూములపై వారసులకు హక్కులు కల్పించాలని (మ్యుటేషన్స్), పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని పలువురు ఈ సభలో అర్జీలు అందజేశారు. సర్పంచ్ శుభలక్ష్మి, తహసీల్దార్ అల్లు సత్యనారాయణ వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ నమోదు చేయిస్తున్న ఐసీడీఎస్ పీవో లక్ష్మి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం ప్రత్యేకంగా ఐదేళ్ల లోపు చిన్నారులకోసం ఏర్పాటు చేసిన సంచార ఆధార్ నమోదు కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని గూడెంకొత్తవీధి ఐసీడీఎస్ పీవో లక్ష్మి కోరారు. గూడెంకొత్తవీధి, రింతాడల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాల సేవలను మంగళవారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావుతో కలసి ఐసీడీఎస్ పీవో పరిశీలించారు. ఐదేళ్ల లోపు చిన్నారుల ఆధార్ నమోదుతోపాటు బయోమెట్రిక్, ధ్రువీకరణపత్రాల నవీకరణ వంటి సేవలు ఈకేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ పాపారావు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

అడ్డతీగల: ముఖ్యమైన రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష తెలిపారు. అడ్డతీగలలోని గాంధీ సెంటర్ నుంచి అనంతగిరి వరకూ రూ.11.20 కోట్ల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంగళవారం ఆమె భూమిపూజ చేసి, ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్, తెలుగు యువత డివిజన్ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మండలంలో పలు రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి శంకుస్థాపన చేశారు. మారేడుమిల్లి మండలంలో రూ. 8.55 కోట్ల వ్యయంతో మారేడుమిల్లి నుంచి చింతలపూడి వరకు కొత్త బీటీ రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు.